

సమ్మర్ కోచింగ్‌కు సై

వేసవి సెలవుల నపథ్యంలో జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం, తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత క్రీడా శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు సత్తా చాటుతున్నారు.

- 8లో..



లారీని అపహరించి.. విడి భాగాలు కాజేసి

పెద్దదోర్నాలలో లారీని అపహరించిన దొంగలు యర్రగొండపాలెం మండలంలోని నిర్జన ప్రాంతంలో నిలిపి విడిభాగాలు అపహరించారు.

- 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37/29

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులు–2025 కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో సూచించారు. మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని డిపార్టుమెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ సంయుక్తంగా ఈ అవార్డులివ్వడం జరుగుతుందన్నారు. 2024 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 5 సంవత్సరాలు నిండిన 18 సంవత్సరాల గరిష్ట వయో పరిమితి గల వారు జూలై 31వ తేదీ లోగా హెచ్‌టీటీపీఎస్://అవార్డ్స్.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌కు తమ వివరాలు పంపాలన్నారు. అసమాన ధైర్యవంతులు, నిస్వార్థంగా పనిచేయడం, అద్భుతమైన ధైర్యసాహసాలు ప్రదర్శించడం, సమాజంలో ఆదర్శంగా నిలుస్తూ వాళ్ల ధైర్యసాహసాలతో బహుళ ప్రాచుర్యం కలిగి ఉండటం, సమాజ సేవ, క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాలు, పర్యావరణం, సంస్కృతి, కళలు, సమయస్ఫూర్తితో అవసరమైనపుడు ధైర్యంగా తమ సామర్థ్యాన్ని నిరూపించినటువంటి వారు ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం



బుద్ధుడికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: సకల జనుల విముక్తి కోసం బుద్ధుడి బోధనలు అనుసరణీయమని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అన్నారు. నగరంలోని మంచి పుస్తకం వద్ద గౌతమ బుద్ధుడి 2590వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు సంవత్సరాల పాటు తపస్సు చేసిన బుద్ధుడు జ్ఞానోదయం చెందాడని తెలిపారు. బుద్ధుడి బోధనలను ఆనాడు ప్రజలంతా ఏకపక్షంగా అంగీకరించారని తెలిపారు. ఆ పిదప సంఘాన్ని స్థాపించి సకల జనుల కోసం జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. సకల జనులకు దుఃఖం నుంచి విముక్తి కల్పించడం, సకల జనులంతా సమానమే అని చాటి చెప్పడం ద్వారా అసమానతలు లేని, కష్టాలు, కన్నీళ్లు లేని సమాజాన్ని నిర్మించేందుకు బుద్ధుడు తలచారని వివరించారు. 12వ శతాబ్దంలో మన దేశంలో జన్మించిన బౌద్ధం అనేక కారణాలతో విదేశాలకు వెళ్లి అక్కడ విస్తరించిందని, తిరిగి ధర్మపాల, అంబేడ్కర్ చేసిన ప్రయత్నాల ఫలితంగా మన దేశంలో ఇప్పుడు బౌద్ధం ప్రకాశవంతం అవుతుందని అన్నారు. దుఃఖం లేని సమాజాన్ని స్థాపించడం బౌద్ధం ద్వారా మాత్రమే సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చావలి సుధాకర్, పాతూరి శ్రీను, ఎంపీ సాలార్, వేజెండ్ల శివరావు, చైతన్య ప్రసాద్, పాలడుగు రమేష్, నాగేశ్వరరావు, సామేలు పాల్గొన్నారు.

ఎంహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షునిగా అజ్రాన్‌బేగ్

ఒంగోలు: ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షునిగా అజ్రాన్‌బేగ్‌ను నియమిస్తున్నట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా ఒక ప్రకటనలో తెలిపారు. అజ్రాన్‌బేగ్ ఒంగోలు వాసి. సమితి బలోపేతానికి కృషిచేస్తానని ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

మంటెక్కిస్తున్న మిర్చి

రోజురోజుకూ పచ్చిమిర్చి ఘాటు పెరుగుతోంది. మార్కెట్లో వీటి ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. కోసి తినకుండానే మంటపుట్టిస్తోంది. వారం రోజులుగా విపరీతంగా పెరుగుతుండడంతో వినియోగదారులు ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో పచ్చిమిర్చి ధర రూ.120 పలుకుతోంది. ఇదే పరిస్థితి మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉందని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం స్థానికంగా పంట లభ్యం కాకపోవడంతోనే ధరలు భారీగా పెరుగుతున్నాయని వారు పేర్కొంటున్నారు. బోర్ల కింద సాగుచేసిన రైతులకు లాభాలే లాభాలు.

- మార్కెట్లో పచ్చిమిర్చి ధర కిలో రూ.120
- దిగుబడులు లేకపోవడంతో పెరుగుతున్న ధరలు
- వారం రోజుల్లో కిలో ధర రూ.80 నుంచి రూ.120కి చేరిక
- బెంగళూరు, కడప, కర్నూలు జిల్లాల నుంచి దిగుమతి
- బోర్ల కింద సాగుచేసిన రైతులకు లాభాలు
- ఎకరాకు 8 నుంచి 10 వేల కిలోల దిగుబడి



మార్కాపురం: వేసవి వచ్చిందంటే కూరగాయల ధరలు కొండెక్కుతాయి. అందులో ప్రధానంగా టమోటా, మిర్చితో పాటు ఆకు కూరల ధరలు కూడా ఆకాశాన్నంటుతాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. ప్రతి ఏడాది ఏప్రిల్ నెలాఖరు నుంచి జూన్ నెలాఖరు వరకూ మిర్చి ధరలు ఎగబాకుతూనే ఉంటాయి. రైతులకు పచ్చిమిర్చి లాభాలు కురిపిస్తుండగా, వినియోగదారులు కొనాలంటే భయపడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో మిర్చి సాగుచేస్తున్నారు. దీంతో స్థానికంగా పచ్చిమిర్చి అందుబాటులో లేకపోవడంతో కడప, బాపట్ల, కర్నూలు జిల్లాలతో పాటు బెంగళూరు నుంచి జిల్లాలోని వివిధ మార్కెట్లకు దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాలో గిద్దలూరు, రాచర్ల, దర్శి, ఒంగోలు తదితర ప్రాంతాల్లో కొంతమంది రైతులు ఈ ఏడాది ఫిబ్రవరిలో బోర్ల కింద మిర్చి సాగుచేశారు. ముందుచూపుతో వారు చేపట్టిన సాగు నేడు అధిక ధరలతో లాభాల పంట పండిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో బాపట్ల జిల్లా మార్టూరు, అద్దంకి, పంగులూరుతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మిర్చి సాగు చేస్తారు. ఆగస్టు నుంచి జనవరి మధ్య మార్కెట్‌కు తెస్తారు.

మిర్చి కిలో ధర రూ.25 నుంచి రూ.40 మధ్య ఉంటుంది. అయితే, వేసవి కావడంతో అన్ని పంటలతో పాటు కూరగాయలు, మిర్చి సాగు కూడా నిలిచిపోయింది. ఈ వేసవిలో ముందు జాగ్రత్తగా సాగుచేసిన రైతులకు మాత్రం ధర ఊహించని విధంగా ఉండటంతో మార్కెట్‌కు తీసుకొచ్చి లాభాలు అర్జిస్తున్నారు. బజ్జీ మిర్చి ప్రస్తుతం బెంగళూరు నుంచి మార్కాపురం మార్కెట్‌కు వస్తోంది. ఇక్కడి నుంచి దోర్నాల, శ్రీశైలం, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, కంభం తదితర కూరగాయల మార్కెట్లకు పంపుతారు. డిమాండ్‌కు సరిపడా మిర్చి మార్కెట్‌కు రాకపోవడంతో రోజురోజుకూ ధర పెరుగుతోంది. వారం రోజుల క్రితం కిలో మిర్చి రూ.80 ఉండగా, నాలుగు రోజుల క్రితం 100కు చేరి ప్రస్తుతం 120 రూపాయలు పలుకుతోంది. ఈ ధర ఇంకా పెరిగే అవకాశం ఉంది.

సాగు ఖర్చు ఇలా...

వేసవిలో పచ్చిమిర్చికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. దీంతో కొంతమంది రైతులు ముందుచూపుతో వ్యవహరిస్తూ బోర్ల కింద మిర్చి సాగుచేస్తున్నారు. ఒక ఎకరా పచ్చి మిర్చి సాగుకు సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.1.70 లక్షల వరకూ ఖర్చు వస్తుంది. ప్రధానంగా గొర్రు, నాగలి, రొటోవేటర్ ద్వారా పొలం సాగుచేసినందుకు, నారు కొనుగోలు, కూలీలు, మందులు, కలుపుమొక్కలు తీయడం, ఎరువులు, రవాణాకు ఖర్చులు అవుతాయి. ఎకరాకు 8 నుంచి 10 వేల కిలోలు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చిమిర్చిని వ్యాపారులు కిలో రూ.70 వరకూ రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. అక్కడి నుంచి రవాణా ఖర్చులు, కూలీలు, తమ లాభం చూసుకుని కిలో రూ.100 నుంచి రూ.120 వరకూ విక్రయిస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి మార్కెట్‌కు



ప్రస్తుతం వేసవి కావడంతో మార్కాపురం ప్రాంతంలో మిర్చి సాగు లేకపోవడంతో గిద్దలూరు, పోరుమామిళ్ల, కడప, మైదుకూరు, కర్నూలు ప్రాంతాల నుంచి మిర్చి వస్తుంది. బజ్జీ మిర్చి బెంగళూరు నుంచి వస్తుంది. రవాణా ఖర్చులు, కూలీల చార్జీలు కలుపుకుంటే మాకు కిలో 95 రూపాయలు పడుతోంది. వేసవి కావడంతో కొన్ని కాయలు పాడైపోతున్నాయి. దీంతో 100 నుంచి 110, 120 మధ్య అమ్ముతున్నాం. వర్షాలు పడి మిర్చి సాగైతే ధర తగ్గుతుంది.

– రమేష్, కూరగాయల వ్యాపారి

మిర్చి, టమోటా సాగుతో లాభాలు



జనవరి, ఫిబ్రవరి నెలల్లో మిర్చి, టమోటా సాగుచేసుకుంటే వేసవిలో మంచి లాభాలు పొందవచ్చు. బోర్ల కింద నీటి సౌలభ్యం ఉంటే వీటిని సాగుచేసుకుంటే వేసవి సీజన్‌లో దిగుబడులు వస్తాయి. మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా కూరగాయలు ఉండవు. అందువలన రైతులు పండించిన కూరగాయలకు మంచి ధర వస్తుంది.

– గోపీనాథ్, హార్టీకల్చర్ ఏడీ, ఒంగోలు



గిద్దలూరు ప్రాంతంలో సాగుచేసిన మిర్చి

నేటి నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు: అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. రెగ్యులర్ పదితో పాటు ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. వేసవి దృష్ట్యా.. పరీక్షల నిర్వహణ సమయంలో ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు చల్లటి పానీయం ఏర్పాటు చేస్తున్నారు. ఇక పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్, పరీక్షల సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేత తదితరాలకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. ఇక రెగ్యులర్ ఇంటర్ పరీక్షలను పూర్తిగా సీసీ కెమేరాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ఎన్నికల ఫీవర్ ఒకవైపు కొనసాగుతుండగానే.. మరోవైపు పరీక్షల ఫీవర్ కూడా ప్రారంభం కావడంతో విద్యాశాఖ వర్గాలు పరీక్షల నిర్వహణలో ఎటువంటి అలసత్వం లేకుండా చర్యలు చేపట్టాయి.

రెగ్యులర్ పది పరీక్షలకు 3,871 మంది...

రెగ్యులర్ పది పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 3,871 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకోసం 22 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు 15 ప్రాంతాల్లో ప్రశ్నపత్రాలను భద్రపరిచారు. 22 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 22 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, 125 మంది ఇన్విజిలేటర్లు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. పరీక్షలు ఉదయం 9.45 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జూన్ 3వ తేదీ వరకు నిర్వహిస్తారు.

రెగ్యులర్ ఇంటర్ పరీక్షలకు 22,366 మంది...

రెగ్యులర్ ఇంటర్ పరీక్షలకు 22,366 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకుగానూ 15,291 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 7,075 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 43 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమేరాలు బిగించారు. కంభం, అర్థవీడు, వై.పాలెం, పెదదోర్నాలలోని పరీక్ష కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు ఇంటర్మీడియెట్ అధికారులు ప్రకటించారు. ఇక పరీక్షల నిర్వహణకు సంబంధించి నిర్ణీత సమయం తర్వాత ఒక్క నిముషం లేటైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరగదని ఇంటర్మీడియెట్ ఆర్ఐవో సైమన్ విక్టర్ ప్రకటించారు.

పక్కాగా ఓట్ల లెక్కింపు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపిన జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి గురువారం వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ శ్రీలత, ఇతర ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, పార్లమెంట్ నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి లోక్‌సభ స్థానానికి 40 టేబుళ్లు, ఒంగోలు అసెంబ్లీకి 7, అదేవిధంగా మిగిలిన నియోజకవర్గాలకు ఐదు చొప్పున ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫలితాలు ఎప్పటికప్పుడు ఎన్కోర్ వెబ్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఈ నెల 22వ తేదీ ర్యాండమైజేషన్ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాకు అదనంగా కేటాయించిన అబ్జర్వర్లతో మొత్తం ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను సమన్వయంతో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కౌంటింగ్ పకడ్బందీగా జరగాలి

సాధారణ ఎన్నికలకు సంబంధించి జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ హాళ్లను ఆయన పరిశీలించారు. రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను, తలుపుల సీళ్లను పరిశీలించారు. అక్కడే ఓట్ల లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. నియోజకవర్గాల వారీగా నిర్దేశించిన టేబుళ్లను కౌంటింగ్ కోసం ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు గదుల వద్ద సిబ్బందికి, రాజకీయ పార్టీల ఏజెంట్లకు వేర్వేరుగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ ఏఆర్‌ఓ ఝాన్సీ, డీఆర్‌ఓ శ్రీలత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ ములాఖత్‌తో ఆనందం



ఈ ములాఖత్‌లో మాట్లాడుతున్న ఖైదీ

ఒంగోలు టౌన్: ఖైదీలకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్న సదుద్దేశంతో రాష్ట్ర జైళ్ల శాఖ ఈ ములాఖత్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా జైలు పర్యవేక్షణ అధికారి పి.వరుణారెడ్డి తెలిపారు. ఆ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసి ఈ ములాఖత్ వివరాలు వెల్లడించారు. సాధారణంగా జైలు వద్దకు వచ్చి ఖైదీలతో వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు మాట్లాడే సదుపాయం ఇన్నాళ్లూ అమలులో ఉందని తెలిపారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఇప్పుడు జైళ్ల శాఖ ఈ ములాఖత్‌ను అమలులోకి తెచ్చిందని వివరించారు. ఈ ప్రిజన్ వెబ్‌సైట్‌లో సందర్శకుల వివరాలు, ఈ మెయిల్, మొబైల్ ఫోన్ నంబర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం జైలు అధికారులు ములాఖత్‌ను అనుమతిస్తూ సందర్శకుల ఈ మెయిల్‌కు ఓటీపీ పంపించడం జరుగుతుందని, తద్వారా నిర్దేశించిన తేదీ, సమయంలో సందర్శకులు వారికి సంబంధించిన ఖైదీలతో వీడియో కాల్ ద్వారా సమావేశమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సౌకర్యం వలన ఖైదీల కుటుంబాలకు సమయంతో పాటు ఆర్థికపరమైన వెసులుబాటు కూడా కలుగుతుందన్నారు. ఈ ప్రిజన్‌లో ములాఖత్‌లో నమోదు చేసుకునే విధానం, అందుకు కావాల్సిన వివరాలను జైలు వద్ద, ఖైదీల బారక్స్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ సదుపాయాన్ని ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ వరుణారెడ్డి కోరారు.

ప్రశాంతంగా కౌంటింగ్‌కు సహకరించండి

- ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

యర్రగొండపాలెం: జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో చిన్న చిన్న సంఘటనలు మినహాయించి ఈ నెల 13వ తేదీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, జూన్ 4వ తేదీ కౌంటింగ్ ప్రక్రియ కూడా ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ కోరారు. స్థానిక త్రిపురాంతకం రోడ్డులోని వైష్ణవి గార్డెన్స్‌లో గురువారం రాజకీయ పార్టీల నాయకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సంఘ విద్రోహులు అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నిస్తారని, మరికొంతమంది కుల, మత, పార్టీలను అడ్డుపెట్టుకుని అలజడులు చేస్తారని, అటువంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. కేవలం ఒకరిద్దరు చేసే గొడవలకు అందరూ తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. గతంలో పోలీసులు గ్రామాల్లో ఎక్కువగా సంచరించేవారు కాదని, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రతి గ్రామంలో పోలీసులు సంచరించి వాహనాలను తనిఖీ చేస్తున్నారని తెలిపారు. దీనికి ప్రధాన కారణం కొత్త నిబంధనలు రావడమేనని ఆయన అన్నారు. పోలింగ్ సమయంలో యర్రగొండపాలెం నియోజకవర్గం పుల్లలచెరువు మండలంలోని శతకోడులో రాళ్లు రువ్వడం, అల్లర్లకు పాల్పడటం లాంటి సంఘటనలు జరిగాయని, ఈ సంఘటనలకు ప్రధాన కారకులైన 19 మందిని బైండోవర్ చేసుకున్నామని చెప్పారు. వీరు తహసీల్దార్ సమక్షంలో రూ.లక్ష ప్రకారం ప్రభుత్వానికి చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో 26 వేల మందిపై బైండోవర్ కేసులు నమోదయ్యాయని, వీరు రూ.5 లక్షల వరకు ప్రభుత్వానికి చలానా కట్టాల్సి ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. గతంలో ఇటువంటి నిబంధనలు ఉండేవి కావని, కేవలం బైండోవర్ మాత్రమే చేసుకునేవారని, ప్రస్తుతం చలానా రూపంలో ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాల్సి వస్తుందని వివరించారు. అంత డబ్బు చెల్లించే అవసరం ఎందుకు వస్తుందని ఆయన ప్రశ్నించారు. కేసులు నమోదు చేయించుకుని డబ్బులు చెల్లించడం వలన ఆయా కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ నిబంధనలను కూడా ఉల్లంఘిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఆయా పేర్లు పోలీస్‌స్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో నమోదై ఉంటాయని, సమీప ప్రాంతాల్లో అల్లర్లు జరిగితే బైండోవర్ అయిన వారిపై దృష్టి సారిస్తారని హెచ్చరించారు. పల్నాడు జిల్లాలో జరుగుతున్న అల్లర్లకు కారకులైన అల్లరిమూకలు గ్రామాల్లో సంచరించే అవకాశం ఉందని, అటువంటి వారితో పాటు అనుమానితులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చకొట్టే విధంగా ఫేక్‌పోస్టులు పెడుతున్న వారితో పాటు గ్రూప్ అడ్మిన్లపై ఐటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కౌంటింగ్ అనంతరం జరిగే విజయోత్సవ ర్యాలీలు, బహిరంగ సభలకు అనుమతులు తీసుకోవాలని, ఆయా ప్రాంతాల్లో అల్లర్లు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. యర్రగొండపాలెంలో మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు ఉంటారని, ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బలగాలు పహారా కాస్తుంటాయని అన్నారు. రిటర్నింగ్ అధికారిణి పి.శ్రీలేఖ మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించి సహకరించాలన్నారు. సదస్సులో మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు, సబ్ డివిజన్ సీఐలు ఆర్.రాములునాయక్, ఆవుల వెంకటేశ్వర్లు, దాసరి ప్రసాద్, సుబ్బారావు, సోమయ్య, రామకోటేశ్వరరావు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

రేపు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పరీక్ష

ఒంగోలు అర్బన్: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ప్రభుత్వ విద్యాశాఖలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నియామకానికి ఈ నెల 25వ తేదీ పరీక్ష నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన 5 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఒంగోలు మంగమూరు రోడ్డు జంక్షన్‌లోని నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చి సోషల్ యాక్షన్ ఇండియా, వెంగముక్కలపాలెంలోని క్విజ్ ఇంజినీరింగ్ కాలేజీ, వల్లూరు వద్ద ఉన్న పేస్ కాలేజీ, పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్, మార్కాపురం మండలం దరిమడుగులోని శ్యామ్యూల్ జార్జ్ కాలేజీల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి 8.15 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. 8.30 గంటల వరకు గ్రేస్ పిరియడ్ కింద అనుమతించడం జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

108 ఉద్యోగి నజీర్ హుస్సేన్‌కు డాక్టరేట్


నజీర్‌హుస్సేన్ (ఫైల్)

గిద్దలూరు రూరల్: పట్టణంలో 108 ఉద్యోగిగా పనిచేస్తున్న నజీర్ హుస్సేన్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ అందజేశారు. ఈ నెల 3వ తేదీన ఆయన గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో ఎడ్యుకేషనల్ డిపార్టుమెంట్‌లో ఎమోషనల్ కాంపిటెన్స్ టీచర్స్ సెల్ఫ్ ఎఫికేసి ఇన్ రిలేషన్ సబ్జెక్టుపై పరిశోధన పత్రం సమర్పించగా.. 21వ తేదీన గౌరవ డాక్టరేట్ అందించారు. ఈ సందర్భంగా ఆయనను పట్టణంలోని పలువురు ప్రముఖులు, ఆయన స్నేహితులు అభినందించారు.

జన్మదిన వేడుకకు వెళ్లొస్తూ.. పరలోకానికి..

- బాపట్ల వద్ద ప్రమాదంలో కనిగిరి యువతి మృతి


మృతురాలు గ్లోరి (ఫైల్)

కనిగిరి రూరల్: బాపట్ల జిల్లా వేటపాలెం వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో కనిగిరి పాతూరుకు చెందిన మన్నేపల్లి గ్లోరి (25) మృత్యువాత పడింది. స్థానికంగా వైఎస్సార్ క్రాంతి పథం(వెలుగు)లో రైతు మిత్రగా పనిచేస్తున్న మన్నేపల్లి టెండూల్కర్, అతని భార్య గ్లోరి బాపట్లలోని ఆమె అన్న కుమారుడి పుట్టిన రోజు వేడుకలకు బుధవారం హాజరయ్యారు. గురువారం కారులో తిరుగుప్రయాణం కాగా, మార్గమధ్యంలో వేటపాలెం వద్ద ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో గ్లోరి అక్కడికక్కడే మృతి చెందగా, భర్త టెండూలకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివాహమైన మూడేళ్లకే గ్లోరి మృత్యు ఒడి చేరడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గురువారం రాత్రి గ్లోరి మృతదేహాన్ని కనిగిరి పాతూరులోని స్వగృహానికి తీసుకొచ్చారు.

జిల్లా క్రీడా భారతి నూతన కమిటీ ఎంపిక

- ప్రెసిడెంట్‌గా పత్తిపాటి విజయ్‌కుమార్


జిల్లా క్రీడా భారతి ప్రెసిడెంట్‌గా పత్తిపాటి విజయ్ కుమార్

టంగుటూరు: ప్రకాశం జిల్లా క్రీడా భారతి నూతన కమిటీ ఎంపికను టంగుటూరులోని శ్రీనివాస థియేటర్ ఆవరణలో క్రీడా భారతి అబ్జర్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుజయల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జిల్లా క్రీడా భారతి ప్రెసిడెంట్‌గా పత్తిపాటి విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్.లావణ్య, కోశాధికారి కె.రవి, వైస్ ప్రెసిడెంట్ ఎల్.వెంకట్రావు, పి.సురేష్, టి.రామ్మూర్తి, పి.అమృతరాజు, జాయింట్ సెక్రటరీలు డి.గంగయ్య, టి. రవికుమార్, కురిచేటి వెంకట్రావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎం.ఉమామహేశ్వర రావు, పి. వెంకట్‌రెడ్డి, పి.వెంకటేష్, ఎం.ధనలక్ష్మి, కె.కోటేశ్వరి, ఎం.మంజుల, డి.రాజు ఎంపికయ్యారు.

కమిటీని ఉద్దేశించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని డివిజన్లో క్రీడాభారతి కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. భారత్‌లో 2036లో నిర్వహించనున్న ఒలంపిక్స్‌లో ఆంధ్ర తరఫున ఎక్కువ పతకాలు తేవడానికి కృషి చేస్తామని చెప్పారు.


మంగమూరు రోడ్‌లోని క్యాంప్‌లో క్రికెట్‌లో మెళకువలు తెలుసుకుంటున్న బాలికలు


శిక్షణలో భాగంగా వామప్ చేస్తున్న చిన్నారులు


ఒంగోలు మినీ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ నేర్చుకుంటున్న చిన్నారులు


మార్కాపురంలో సమ్మర్ క్యాంప్‌లో బాక్సింగ్ శిక్షణ



సమ్మర్ కోచింగ్‌కు సై

వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఒంగోలు నగరంలోని ఏబీఎం గ్రౌండ్, మినీ స్టేడియం, మంగమూరు రోడ్డులోని క్రికెట్ కోచింగ్ సెంటర్, మార్కాపురం పట్టణంలో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణపై చిన్నారులు అమితాసక్తి చూపుతున్నారు. క్రికెట్, ఆర్చరీ, బాక్సింగ్, ఫుట్‌బాల్, శపక్‌తక్రా తదితర క్రీడల్లో విద్యార్థులు మెళకువలు తెలుసుకుని సాధన చేస్తున్నారు.

– సాక్షి, ఒంగోలు


ఏబీఎం గ్రౌండ్‌లో ఫుట్‌బాల్‌లో తర్ఫీదు


ఒంగోలు ఏబీఎం గ్రౌండ్‌లో ఆర్చరీ శిక్షణ పొందుతున్న విద్యార్థులు


మినీ స్టేడియంలో శపక్‌తక్రా సాధన


బ్యాటింగ్ ప్రాక్టీసులో బాలికలు

లారీని అపహరించి.. విడి భాగాలు కాజేసి

- పెద్దదోర్నాలలో లారీని మాయం చేసిన దొంగలు
- వైపాలెం మండలంలో నిర్జన ప్రాంతంలో నిలిపి విడిభాగాల అపహరణ
- కుంట ప్రాంతంలో కొన్ని విడి భాగాలు అమ్మినట్లు సమాచారం


విడిభాగాలు అపహరించి దొంగలు వదిలేసిన లారీ

పెద్దదోర్నాల: పార్కింగ్‌లో ఉంచిన లారీతో ఉడాయించిన కొందరు దుండగులు నిర్జన ప్రాంతానికి తరలించి టైర్లు, డిస్కులతో సహా పలు రకాల విడి భాగాలను అపరించారు. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి పెద్దదోర్నాలలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం మేరకు.. పెద్దదోర్నాలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలోని మెకానిక్ షెడ్ల వద్ద బాడుగలు లేని లారీలు, ట్రిప్పర్లు నిలిచి ఉంటాయి. బుధవారం రాత్రి పెద్దదోర్నాలకు చెందిన డ్రైవర్ కమ్ ఓనర్ పఠాన్ యాసిన్‌ఖాన్ లారీని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. తొలుత పెద్దారవీడు మండలం కర్రోల ప్రాంతానికి, అక్కడి నుంచి యర్రగొండపాలెం మండలంలోని గంగుపల్లి గ్రామ సమీపంలో నిర్జన ప్రదేశానికి లారీని తరలించారు. అక్కడ లారీకి ఉన్న 12 టైర్లు, డిస్కులు తొలగించడంతోపాటు బ్యాటరీలు, 200 లీటర్ల డీజిల్, టార్పాలిన్ పట్టలు, తాళ్లు తదితర సామగ్రిని మరో వాహనంలో వేసుకుని దర్జాగా వెళ్లిపోయారు. కేవలం రాళ్లను మాత్రమే ఉపయోగించి లారీ 12 టైర్లు, డిస్కులు తొలగించిన తీరు చూసి పోలీసులతోపాటు మోటార్ ఫీల్డ్‌లో ఉన్న వారు విస్తుపోయారు. సుమారు రూ.3 లక్షల విలువైన లారీ సామగ్రి చోరికి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. లారీని దొంగిలించి తన జీవనాధారంపై దెబ్బకొట్టారని యాసిన్‌ఖాన్ విలపించడం అందిరినీ కలచివేసింది. లారీ చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అంకమరావు తెలిపారు. కాగా, హనుమాన్ జంక్షన్ కుంట ప్రాంతంలో కొన్ని విడి భాగాలను దొంగలు విక్రయించినట్లు సమాచారం.

అదుపు తప్పి బైకును ఢీకొట్టిన కారు

- ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


సంఘటనా స్థలంలో క్షతగాత్రులు గురవయ్య, ఇస్మాయిల్, కిషోర్

కొనకనమిట్ల: మంచినీరు తాగేందుకు రోడ్డు పక్కన దుకాణం వద్ద ఆగి ఉన్న యువకులపైకి కారు అదుపు తప్పి దూసుకెళ్లింది. 565 జాతీయ రహదారి కొనకనమిట్ల మండలం చినారికట్ల జంక్షన్ సమీపంలో గురువారం సంభవించిన ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. మండంలోని రేగడపల్లి, చింతగుంట గ్రామాలకు చెందిన బూదాల గురవయ్య, ఇస్మాయిల్, కిషోర్ వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై కనిగిరి వెళ్తున్నారు. ఈ క్రమంలో మంచినీరు తాగేందుకు చినారికట్ల జంక్షన్ దగ్గర ఆగారు. బైక్ దిగే సమయంలో కనిగిరి వైపు నుంచి వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో గురవయ్య, ఇస్మాయిల్, కిషోర్ కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. సంఘటనా స్థలాన్ని కొనకనమిట్ల ఎస్సై మాధవరావు పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- ఒంగోలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్‌పటేల్


విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందిస్తున్న భాస్కర్‌పటేల్

మార్కాపురం: విద్యార్థులు స్కిల్స్ సామర్థ్యాన్ని పెంచుకుంటూ పోటీతత్వాన్ని కలిగి ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఒంగోలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్‌పటేల్ పేర్కొన్నారు. మార్కాపురంలోని డాక్టర్ సామ్యేల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థికి ఉద్యోగం అనేది షార్ట్ టర్మ్ అని, కెరీర్ లాంగ్ టర్మ్ లాంటిదన్నారు. ప్రశ్నించే తత్వాన్ని అలవాటుచేసుకుంటే ప్రతి ప్రశ్నకు జవాబు ఆలోచన ద్వారా వస్తుందన్నారు. విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందచేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు, డీన్ అకడమిక్స్ డాక్టర్ మస్తానయ్య, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కంపకల్లి

- ఘనంగా ముగిసిన లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు


కంపకల్లిపై దొర్లుతున్న భక్తులు

హనుమంతునిపాడు: మండలంలోని చిన్న గొల్లపల్లిలో శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం సాయంత్రం కంపకల్లి కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. కంపకల్లి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, మేకపోతును బలి ఇచ్చి, కన్నమరాజు దండకాలతో పోతు రాజులు కంపకల్లి చుట్టూ వీర కేకలు, గోవింద నామాలతో ప్రదక్షిణ చేశారు. ముందుగా పెద్దగొల్లపల్లి, భద్రాచలం చెక్కా వంశస్తులు కంపకల్లిపై దొర్లారు. అనంతరం భక్తులు కంపకల్లిపై దొర్లి మొక్కులు చెల్లించారు. కంపకల్లిని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అనంతరం స్వామివారి వసంతోత్సవం, అశ్వ వాహన సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈఓ వి.శ్రీనివాసబాబు, పరిశీలకులు జీవీ సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కంపకల్లిపై చిన్నారులను దొర్లించకుండా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్.గౌసున్నీసాబేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. కనిగిరి సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కనిగిరి, హనుమంతునిపాడు, పీసీపల్లి ఎస్సైలు త్యాగరాజు, శివనాగరాజు, రమేష్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


లక్ష్మీ చెన్నకేశవస్వామి కొణతాలను ఊరేగిస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి


ప్రమాద స్థలంలో నుజ్జయిన కారు


ప్రమాద స్థలం వద్ద ఢీకొన్న వాహనాలు

- నలుగురు కుటుంబ సభ్యులకు తీవ్ర గాయాలు
- నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం చింతలకుంట వద్ద కారును ఢీకొట్టిన లారీ
- తిరుపతిలో మొక్కు చెల్లించి వస్తుండగా దుర్ఘటన

సీఎస్‌పురం(పామూరు): కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలలో మొక్కు చెల్లించి వస్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందాడు. సీఎస్ పురం మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పాలుగుళ్ల వెంకటేశ్వరరెడ్డి(30) బుధవారం రాత్రి నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం చింతలకుంట సమీపంలో 167బిజి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వెంకటేశ్వరరెడ్డి మృతదేహానికి గురువారం సాయంత్రం ఉప్పలపాడులో బంధువులు అశ్రు నయనాల మధ్య అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

మొక్కు తీర్చుకుని వస్తూ తిరిగిరానిలోకాలకు..

వెంకటేశ్వరరెడ్డికి 6 నెలల క్రితం పామూరుకు చెందిన మంజులతతో వివాహమైంది. తిరుమలలో మొక్కు చెల్లించేందుకు వెంకటేశ్వరరెడ్డి తన భార్య మంజులత, తండ్రి సుబ్బారెడ్డి, తల్లి నారాయణమ్మ, అక్క కుమారుడు అభిరూప్‌నందన్‌రెడ్డితో కలిసి స్వయంగా కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లాడు. బుధవారం తిరుగు ప్రయాణంలో ఉన్నారు. మార్కాపురం నుంచి చిత్తూరు వెళ్తున్న పాలలారీ అర్ధరాత్రి వేళ దుత్తలూరు మండలం చింతలకుంట సమీపంలో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న పాలుగుళ్ల వెంకటేశ్వరరెడ్డి (30) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య మంజులత, తండ్రి సుబ్బారెడ్డి, తల్లి నారాయణమ్మ, అక్క కుమారుడు అభిరూప్‌నందన్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. కారు నుజ్జునుజ్జయింది. సమాచారం తెలుసుకున్న దుత్తలూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఉదయగిరికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరు వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితిని నిలకడగా ఉందని తెలిసింది.


కుటుంబ సభ్యులతో మృతుడు వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

కాసేపట్లో ఇంటికి చేరుతామనగా కబళించిన మృత్యువు

మరికొద్ది నిముషాల్లో ఇంటికి చేరాల్సిన కుటుంబం ఊహించని ప్రమాదంలో చిక్కుకోవడం, ఒకరు మృత్యువాత పడటం, నలుగురు తీవ్ర గాయాలపాలు కావడంతో ఉప్పలపాడు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదవార్త విని బంధువులు శోకసంద్రంలో మునిగారు.